క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయంలో విగ్రహపున:ప్రతిష్ఠాపన



ఊట్కూరు: మండలంలోని చౌడేశ్వరి ఆలయంలో ఈ నెల 20న విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులు హన్మంతు, కోటప్ప, బుద్ది విఠోభ, మోనప్ప ఒక ప్రకటనలో తెలిపారు. 18న గోపూజా, ఆలయ ప్రవేశం ప్రతిష్ఠ మూర్తుల ఊరేగింపు, 19న ధాన్యదివాసం, 20న చౌడేశ్వరిదేవి విగ్రహప్రతిష్ఠాపన, పుర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యంలో పాల్గొనాలని కోరారు.

రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు విద్యార్థి ఎంపిక



సందీప్

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గిరిజన గురుకులానికి చెందిన ఎంపీసీ సెకండియర్ విద్యార్థి సందీప్ సంగారెడ్డి జిల్లాలో ఈనెల17నుంచి 19వరకు నిర్వహించనున్న 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్ 19 కబడ్డీపోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ రాజారాం తెలిపారు. ఈ ఎంపికపై వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌రావు, నాగమణి, కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్, పీటీ సుగుణాకర్, సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

మరికల్: మండల కేంద్రంలోని బాలుర, బాలికల, ప్రాథమికోన్నత పాఠశాల వద్ద సీసీరోడ్డుపై మంగళవారం సర్పంచ్ గోవర్దన్ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పాఠశాల నుంచి విద్యార్థులు బయటకు వచ్చేసమయంలో బైక్‌లు ఢీకొట్టడంతో పలువురి విద్యార్థులకు గాయలైయ్యాయి. ప్రమాదాలు మళ్లీ చోటుచేసుకోకుండా పాఠశాల గేట్ ఎదుట వాహనాల వేగం తగ్గించేందుకు స్పీడ్‌బ్రేకర్లు చేయించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా మలుపు



నర్వ: మండలంలోని ప్రధాన రహదారుల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేక పోవడంతో తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక పక్క మలుపుల రోడ్డు, మరోపక్క వాహనాల అతివేగంతో ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రజలు వాపోతున్నారు. మండల కేంద్రం నుంచి రాంపూర్ గేట్ వరకు ఉన్న రహదారిపై వివిధ మలుపులున్నప్పటికీ అక్కడ పంచాయతీరాజ్ అధికారులు ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంకాల్ చెరువు కట్ట మలుపు వద్ద, నర్వ, లంకాల్ మధ్యన బోర్డులను ఏర్పాటుచేస్తే ప్రమాదాలను నివారించొచ్చని, అధికారులు దృష్టిసారించి బోర్డులు ఏర్పాటుచేయాలని వారు కోరుతున్నారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



కోస్గి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవంత్‌రెడ్డికి ఓటేసి భారీమెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ సభ్యులు వార్ల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలను తిరుగుతూ చేపట్టిన ప్రచారంలో భాగంగా మంగళవారం మున్సిపాలిటీతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు ప్రచారం చేశారు. ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన ప్రజా వ్యతిరేక పాలనను వివరించారు. ఈ మేరకు పార్టీ నాయకులు.. మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, మధ్య తరగతి వారి అభివృద్ధికోసం పని చేస్తే ప్రస్తుత ప్రభుత్వాలు కార్పొరేట్‌ల అభివృద్ధికోసం పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు గోవర్దన్‌రెడ్డి, ఇద్రీస్, భానునాయక్, నాయకులు నాగులపల్లి శ్రీనివాస్, సలీం, విద్యాసాగర్, ప్రభోత్తం, నర్సింహ, వెంకట్రాములు, చెన్నారం మల్లేష్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



మక్తల్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళ భక్తులు



పేటలో కోటకొండ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో



ఊట్కూరులోని..

నారాయణపేట రూరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజూ అమ్మవారు అన్నపూర్ణదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని శక్తిపీఠంతోపాటు మహంకాళి, చౌడేశ్వరి, అంబాభవాని, నగరేశ్వరాలయాల్లో ప్రత్యేక అలంకరణలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అష్టోత్తర శతనామావళి, శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో, సింగారం గిరిపీఠంపై వెలిసిన భవానిమాత ఆలయం, కోటకొండలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా పట్టణంలోని సరాఫ్‌బజార్ బసవేశ్వర దేవాలయం, మడి శివాలయంలో ఎస్ఎస్‌కే సమాజ్, బసవేశ్వర ఆలయం, బారంకుంట్ల, బ్రాహ్మణ్‌వాడి, చౌక్‌బజార్‌లో అంబేద్కర్ చౌరస్తా చౌడమ్మ ఆలయంలో దుర్గాదేవి విగ్రహాలను భక్తులు పూజలు చేశారు. అలాగే స్థానిక సంత్‌మత మూల మహాసంస్థానం శక్తిపీఠం మహిళ కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శోభయాత్రలో మహిళలు, చిన్నారులు కోలాటం, నృత్య ప్రదర్శనలు చూపరులను అకట్టుకున్నాయి. అనంతరం కొండరెడ్డిపల్లి చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. పట్టణంలోని సరాఫ్‌బజార్ బసవేశ్వర ఆలయం వద్ద ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహ మండపంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పలు పాఠశాలల చిన్నారుల నృత్యాలు అకట్టుకున్నాయి. ఆలయ అర్చకులు బుస్సయ్య స్వామి, ప్రిన్సిపాల్ దత్తుచౌద్రి, చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

మక్తల్: దేవి శరన్నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మంగళవారం వాసవిమాతను గౌరిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మహిళ భక్తులు 1లక్ష 16 వేల రూపాయల గాజుల ప్రదర్శనతో అమ్మవారికి పసుపు, కుంకుమార్చనతో ప్రత్యేక పూజలు మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని మాద్వార్ లో బ్రహ్మంగారి ఆలయం వద్ద దుర్గామాతకు ప్రత్యే పూజలుచేశారు. పట్టణంలో శ్రీ లక్ష్మి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం వద్ద స్వామి వారిని కల్పవృక్ష వాహనంపై ఊరేగించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారికి పూజలుచేసి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆయా కార్యక్రమాలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవి విగ్రహాలకు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారికి అష్టోత్తర శతనామావళి, పంచామృతాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలను అర్చకులు ప్రవీణ్‌కుమార్ నిర్వహించారు. పెద్ద కడ్మూర్‌లో నిర్వహించిన పూజాకార్యక్రమంలో దాత మోనేషాచారి దంపతులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఊట్కూరు: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజూ మంగళవారం మండలంలోని భవాని మందిర్‌లో అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కుంకుమార్చన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చౌదరి, అశోక్, భాస్కర్‌రావు, తుల్జారాం, చందులాల్, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఏర్పాటుచేసిన దుర్గామాత భక్తులకు మంగళవారం గాయత్రిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. భక్తులకు నిత్య అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



నారాయణపేట బ్రాహ్మణ్‌వాడి చౌడేశ్వరీ ఆలయంలో..



నారాయణపేట సాంస్కృతిక కార్యక్రమాల్లో మహిషాసురమర్దిని నాటక ప్రదర్శన



నారాయణపేట శాతవాహన కాలనీలో బతుకమ్మతో చిన్నారులు..



మరికల్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మక్తల్‌లో..



నర్వలో పెద్దకడ్మూర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు



నారాయణపేటలో..



మక్తల్‌లో..

లోకకల్యాణ మహాయజ్ఞం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న శాంతనంద్ పురోహిత్

నారాయణపేట రూరల్ : పట్టణంలోని రామమందిరంలోని శక్తిపీఠం ఆవరణలో మంగళవారం స్వామి శాంతనంద్ పురోహిత్ చేతుల మీదుగా లోక కల్యాణ మహాయజ్ఞం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కలియుగంలో అమ్మవారి నామస్మరణ ఎంతో పవిత్రమైందని, అత్యంత విశేష ఫలితాలను కల్గిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చైతన్యం కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రాములు, నారాయణరెడ్డి, సుధాకర్, రాజశేఖర్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

మక్తల్: మండలంలోని సంగంబండలో గురుకుల పాఠశాల విద్యార్థులు కలెక్టర్ చేతులమీదుగా ట్రోఫీ, మెడల్స్ అందుకున్నట్లు ప్రిన్సిపాల్ మాధవి, విశ్రాంత పీఈటీ గోపాలం మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 13 నుంచి 16 వరకు జరిగిన ఓరల్ చాంపియన్ షిప్ 9వ జోనల్ క్రీడల్లో రాణించారన్నారు. జోనల్స్ క్రీడల్లో రాణించి విజయం సాధించిన బాలికలను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వేదవతి, తిరుపతమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పత్తి పంటలపై ఇటుకల బట్టీల బూడిద



పత్తి పంటలపై ఇటుకల బట్టీల బూడిద ఇలా..

కృష్ణా: మండలంలోని నల్లగట్టు సమీపంలో గల ఇటుక బట్టీలతో రైతుల పంటలకు అపారనష్టం వాటిల్లుతుంది. గతకొంత కాలంగా రైతులు తమ ఇబ్బందులను తెలియజేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం పత్తి పంటల్లో బట్టీల బూడిద చేరడంతో తమ పంటలకు అపార నష్టం వాటిల్లుతుందని ఆ ప్రాంత రైతులు ఆరోపిస్తున్నారు. మంగళవారం గుడెబల్లూర్ రైతులు విలేకరులతో మాట్లాడుతూ ఇటుకల బట్టీలోని బూడిద మొత్తం గాలికి తమ పంటలపై చేరడంతో వరి, పత్తి పొలాల దెబ్బతిన్నాయని, సరైన ధరలు రాక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇటుకల బట్టీల యజమానులు తమ తమ లాభాల కొరకు తమ పంటలకు నష్టం వాటిల్లుతుందని పలుమార్లు బట్టీల యజమానులకు, స్థానిక రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దీంతో తాము బాధిత రైతులతో కలెక్టర్‌కు త్వరలో ఫిర్యాదు చేస్తామని అన్నారు.

సరైన ధరలు రావడం లేదు..



ప్రస్తుతం కాచిన పత్తిపై ఇటుకల బట్టీల బూడిద గాలికి వచ్చి పత్తిపై పడుతుండడంతో మార్కెట్‌లో సరైన ధరలు రావడం లేదు. ఈ విషయంపై అధికారులు పట్టించుకుని తమకు న్యాయం చేయాలి.

– రాము, గుడెబల్లూర్, బాధిత రైతు

ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు

నారాయణపేట రూరల్: చిత్తు చిత్తుల బొమ్మా.. శివుని ముద్దులగుమ్మా.... అంటు బతుకమ్మ పాటలతో పట్టణంలోని వీధులన్ని హోరెత్తిపోయాయి. మూడో రోజు పుష్పాలన్ని మహిళలు, చిన్నారుల చేతిలో చేరి అగ్రపూజలు అందుకున్నాయి. శక్తిపీఠం ఆధ్వర్యంలో బతుకమ్మ ప్రతిమతో పట్టణంలో శోభాయాత్ర చేపట్టారు. అశోక్‌నగర్, ధూల్‌పేట తదితర ప్రాంతాల్లో మహిళలు తీరొక్క పువ్వులతో బతుకమ్మను తయారుచేసి కోలాటాలు, దాండియా ఆటలతో బతుకమ్మ పాటలకు బొడ్డెమ్మలు వేస్తూ ఎంతో అలరించారు. అనంతరం కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు.



కాంగ్రెస్ టికెట్ కుంభం శివకుమార్‌రెడ్డికే

నారాయణపేట : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్‌ను పార్టీ అధిష్టానం తమ నాయకుడు కుంభం శివకుమార్‌రెడ్డికే కేటాయించినట్లు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక డీసీసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు.. సర్వేల ఆధారంగా కాంగ్రెస్ అధిష్ఠానం శివకుమార్‌రెడ్డి వైపు మొగ్గుచూపి టికెట్ కేటాయించిందని, ఈ నెల 22న అధికారికంగా ప్రకటిస్తుందన్నారు. ఈ మేరకు.. పార్టీ అధిష్టానానికి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ధాన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలను, నాయకులు వ్యక్తిగతపనులను పక్కన పెట్టి తమ తమ గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టి శివకుమార్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో సదాశివారెడ్డి, సుధాకర్, ఎండీ గౌస్, బాల్‌రెడ్డి, ఎండీ సలీం, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట రూరల్: డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 2020–21 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలు పాస్ అయి ఆరోసెమిస్టర్‌లో ఒక పరీక్షఫేయిల్ అయితే వారికి ఒన్‌టైం అవకాశం కల్పించినట్లు పరీక్షల విభాగం అధికారి నారాయణగౌడ్ తెలిపారు. బీఏ విద్యార్థులు రూ.650, బీకామ్, బీఎస్సీ విద్యార్థులు రూ.750లను ఈ నెల 19లోపు చెల్లించాలని సూచించారు.

పెరిగిన జొన్నసాగు..



మరికల్: ఉమ్మడి మండలంలో పచ్చజొన్న పంటలసాగు ఈ ఏడాది బాగానే పెరిగింది. ప్రస్తుతం పంటలు చేతికి రావడంతో పచ్చజొన్నల కోసం డిమాండ్ పెరుగుతుంది. గత యేడాది మరికల్, ధన్వాడ మండలాల్లో 185 ఎకరాల్లో సాగుచేయగా ఈ ఏడాది 308 ఎకరాలకు పెరిగింది. మార్కెట్‌లో పచ్చజొన్నకు క్వింటాల్‌కు రూ. 8వేల వరకు మద్దతు ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చేతికొచ్చిన జొన్నపంటలను కోతవేసిన కంకులను రైతులు మిషన్లకు వేసి నూర్పిడిలు చేస్తున్నారు. గత మూడేళ్ల నుంచి ఆశించినస్థాయిలో పత్తిపంటల దిగుబడులు లేకపోవడంతో రైతులు జొన్నపంటలపై మొగ్గు చూపుతున్నారు.

అక్రమ లిక్కర్ పట్టివేత

నారాయణపేట రూరల్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అక్రమంగా లిక్కర్‌ను నిల్వ ఉంచొద్దనే నిబంధనలు ఉల్లంఘించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ఎస్ఐ జయప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం మండలంలోని బొమ్మన్‌పాడులో భరత్ అనే వ్యక్తి ఇంట్లో రూ.5వేల విలువ గల లిక్కర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. అదేవిధంగా ఫ్లయింగ్‌స్కాడ్ బృందం లింగంపల్లిలో నర్సింగమ్మ ఇంట్లో దాడులు చేయగా రూ.51,500విలువ గల మద్యం గుర్తించి సీజ్ చేశారు. ఇరువురిపై కేసునమోదు చేయనున్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలి



అమరచింత: ప్రైవేట్ రంగాల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు కల్పించాలని కేవీపీఎస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దళితుల రాజ్యాంగ హక్కుల సాధన కోసం 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం పట్టణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితుల సమస్యలు కేంద్రం దృష్టికి తీసుకుపోయే విధంగా రాష్ట్రపతికి కోటి సంతకాలు సేకరించి అందజేయనున్నట్లు వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అజయ్, శ్యాంసుందర్, బుచ్చన్న, అరుణ్, సతీష్, రవికుమార్, ప్రకాశం, నిశాంత్, తిరుమతి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఆత్మకూర్: ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఎస్ఐ నరేందర్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక గాంధీచౌక్‌లో ముమ్మరంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. అలాగే వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా వాహనాల్లో నగదు తరలింపు, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

